
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 9 జూన్ 2024





నాడు-నేడు నొక్కుడు



గుంటూరు ఎన్టీవోకాలనీ ఎస్‌కేబీపీఎం స్కూల్‌లో నిర్మాణ దశలోనే గదులు

- తల్లిదండ్రుల కమిటీ పేరుతో వైసీపీ నేతలే పనులు
- అరకొర సాగిన పనులు.. యథేచ్ఛగా బిల్లులు చెల్లింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.600 కోట్లకుపైగా వ్యయం
- ఐదేళ్లు గడుస్తున్నా పాఠశాలల్లో కొలిక్కిరాని పనులు
- మొదటి దశలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు మూలకు
- పనులపై విచారణకు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్

గుంటూరు(విద్య), జూన్ 8: విద్యావ్యవస్థలో సంస్కరణలు పేదలకు కూడా కార్పొరేట్ తరహా విద్య అంటూ వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. నాడు నేడు పేరుతో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేకలు మారుస్తామని, విద్యార్థులకు అత్యాధునిక వసతులు, సమగ్ర సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించింది. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున పనులు చేపట్టింది. ఆయా పనులను పాఠశాలల వారీగా గుర్తించి తల్లిదండ్రుల కమిటీలతో చేయించాలే వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే తల్లిదండ్రుల కమిటీల ముసుగులో వైసీపీ నాయకులు చాలా దగ్గర్ల ఆయా పనులను దక్కించుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాడు నేడు తొలి దశలో 1149 పాఠశాలలను ఎంపిక చేసి దాదాపు రూ.325 కోట్లకుపైగా ఖర్చు చేసినట్లు సమాచారం. రెండో దశలో 1344 పాఠశాలలను ఎంపిక చేసి మరో 340 కోట్లు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు. అయితే రంగులేసి.. తూతూ మంత్రపు పనులతో మమ అనిపించి రూ.లక్షల్లో జేబుల్లో వేసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. అయితే ప్రభుత్వం వారిదే కావడం.. ఇష్టారీతిన పనులు చేసినా అటు ఉపాధ్యాయులు, ఇటు అధికారులు ప్రశ్నించలేకపోయారు. నాణ్యతా లోపంతో ఆయా పనులు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చినా ఇంతకాలం ఎవరూ నోరుమెదపలేదు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌళిక వసతుల కల్పనే లక్ష్యంగా సాగిన పనులు ఐదేళ్లు కావస్తున్నా కొలిక్కిరాలేదు. శిథిలమైన పాఠశాలలను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామనే ముసుగుతో తల్లిదండ్రుల కమిటీల మాటును చేసిన పనులతో వైసీపీ నాయకులు పెద్దఎత్తున దోచుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచి ఉన్నాయి. తాగునీరు, టాయిలెట్, ఫర్నీచర్, కాంపౌండ్ వాల్, రంగులు, మరమ్మతులు, ఫ్యాన్లు, లైట్లు, వంటగది, ఇంగ్లీషు మీడియం ల్యాబ్‌ల ఏర్పాటు పేరుతో పెద్ద మొత్తంలో కమీషన్లు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు సహా పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాల నుంచి మారుమూల గ్రామాల్లోని పాఠశాలల వరకు సక్రమంగా పనులు చేయలేదు. కార్పొరేట్ కట్టడాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది విద్యా వికాసానికి బాటలు వేస్తున్నామని నమ్మించిన వారు పనులను మాత్రం పూర్తిచేయలేదు.



నల్లపాడులోని జడ్పీ స్కూల్‌లో వాటర్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన కూలర్

నిర్మాణ దశలోనే పనులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాడు నేడు పనులు 2021లో ప్రారంభించారు. దాదాపు ఐదేళ్లు పూర్తి కావస్తున్నా పనులు ఇంకా పూర్తికాలేదు. గుంటూరులోనే అనేక పాఠశాలల్లో నిర్మాణ పనులు వెక్కిరిస్తున్నాయి. ప్రతి దగ్గర వైసీపీ వారే ఆయా పనులు చేపట్టారు. అనేక చోట్ల పనుల్లో నాణ్యత లోపం కనిస్తున్నా బిల్లులు చెల్లింపు మాత్రం యథేచ్ఛగా సాగింది. మొదటి విడతలో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు ఇప్పుడు దాదాపు మూత పడ్డాయి. కాంట్రాక్టు ఏజన్సీ ఐదేళ్లపాటు మరమ్మతులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రెండో దశలో కూడా సంవత్సరం క్రితం అనేక పాఠశాలలకు వాటర్ ప్లాంట్లు వచ్చాయి. వీటిని ఇంత వరకు వినియోగం లోకి తీసుకురాలేదు. పనుల పర్యవేక్షణను విద్యాశాఖ అధికారులు అసలు పట్టించుకోలేదు. పనుల పురోగతిని యాప్స్‌లో నమోదు చేయమని ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో నాణ్యత, పనుల వేగం గురించి ప్రశ్నించిన దాఖలాలు లేవు. దీంతో నాడు నేడు పనులు ఇష్టారాజ్యంగా సాగాయి. కొంతమంది అధికారులు ఇందుకు ఇతోధికంగా సహకారం అందించి బిల్లుల మంజూరులో భారీ స్థాయిలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో నాడు నేడు పనులు చేసే కాంట్రాక్టర్లను బెదిరించి నరసరావుపేటలో విద్యాశాఖ కార్యాలయం నిర్మాణం కోసం అప్పటి ఇన్‌చార్జి డీఈవో మేకతోటి వెంకటప్పయ్య నిధులు వసూలు చేసిన విషయం బహిర్గతమైన విషయం తెలిసిందే. ఇలా నాడు నేడు పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని అటు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చెత్తపన్నుకు.. చెక్

- పట్టణ వాసులకు శుభవార్త
- వసూలు నిలిపివేయాలని ఆదేశాలు
- వైసీపీ హయాంలో రూ.9.48 కోట్లు వసూలు
- ప్రజలపై ఆర్థిక భారాన్ని తొలగించిన కూటమి ప్రభుత్వం

సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటూ పాలన సాగించిన వైసీపీ పాలకులు ప్రజలను అందినకాడికి పిండేశారు. పన్నులు, చార్జీలు, ధరలతో విపరీతంగా దోచేశారు. పన్నుల్లో ప్రధానంగా చెత్త పన్ను ఒకటి. ఎక్కడా లేని విధంగా.. ఎప్పుడూ చూడని విధంగా.. ఏ ప్రభుత్వం చేయనట్లుగా.. చెత్త పన్ను వసూలు చేసి ముఖ్యమంత్రిగా జగన్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. చెత్త ప్రభుత్వం.. చెత్త ముఖ్యమంత్రి అన్న విమర్శలు కూడా వచ్చాయి. చెత్తపన్నుపై ప్రజలతో పాటు ప్రతిపక్షాలు ఆందోళనలు చేశాయి. అయినా వెనక్కి తగ్గని జగన్ ప్రభుత్వం మున్సిపాల్టీ ప్రాంతాల్లోని ఇళ్ల నుంచి చెత్త పన్నును ప్రత్యేకంగా వసూలు చేసింది. రోజుకు రూ.2 నుంచి 4వరకు ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ పేరుతో వసూలు చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పుర ప్రజల ముక్కు పిండి మరీ రూ.9.48 కోట్లు వసూలు చేశారు. చెత్త పన్ను వసూలు బాధ్యతలను సచివాలయాలకు, వారు వలంటీర్లకు లక్ష్యాలు విధించి మరీ అప్పగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రానున్న నేపథ్యంలో తాజాగా చెత్త పన్ను వసూళ్లను ఆపేశారు. దీంతో పట్టణాల్లో ప్రజలు చెత్త పన్ను నుంచి తప్పించుకున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ పన్నుల బాదుడు నుంచి కుటమి ప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగా చెత్త పన్నుకు చెక్ చెప్తూ పుర ప్రజలకు శుభవార్తను అందించింది. తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను ఎత్తివేస్తానని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు సిద్ధమయ్యారు. కూటమి విజయం సాధించగానే చెత్త పన్ను వసూలు నిలిపివేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం ఏర్పడ్డాక చెత్త పన్ను రద్దు చేస్తే జీవో విడుదల చేయనుంది. వైసీపీ ప్రభుత్వం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపల్ ప్రజల నుంచి చెత్త పన్ను రూ.9.48 కోట్లు వరకు వసూలు చేసింది. ఆస్తి పనుల కంటే ఎక్కువగా ప్రజల ముక్కు పిండి మరీ చెత్త పన్ను వసూలు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కింది. క్లాప్ పేరుతో నూతన పారిశుధ్య విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంది. దీనిని అమలులో చతికిల పడింది. క్లాప్ అట్టర్ ప్లాప్ అయింది. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయాల్సిన వైసీపీ ప్రభుత్వం ఈ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకుంది. వలంటీర్లకు లక్ష్యాలు విధించి మరీ చెత్త పన్ను వసూలు చేయించారు. దీంతో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించే సమయంలో చెత్త పన్ను మినహాయించుకున్న సంఘటనలున్నాయి.

ఒక్కో ఇంటి నుంచి రూ.720 వసూలు

సేవా రుసూము పేరుతో చెత్తకు పన్ను విధించడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా మున్సిపల్ అధికారులు బెదిరించి మరీ చెత్త పన్ను వసూలు చేశారు. పరిశుభ్రత లేకుండా చెత్త పన్ను ఏమిటని ప్రజలు ప్రశ్నించినా లెక్క చేయలేదు. పారిశుధ్య పనులకు అయ్యే ఖర్చును ప్రజలపైనే భారం వేశారు. పేద.. ధనిక అన్న తేడా లేకుండా ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.60 నుంచి రూ. 120 వరకు వసూలు చేసింది. ఆ ప్రకారం ఏడాదికి రూ.720 వసూలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పేదల గృహాలకు ఇంటి పన్ను కంటే చెత్త పన్ను అధికంగా వసూలు చేశారంటే ఆశ్చర్యం కాదు. స్థానిక సంస్థల నింబంధనల ప్రకారం ఆస్తి పన్నులో పారిశుధ్య పన్ను కూడా కలిసి ఉంటుంది. అయినా ప్రత్యేకంగా చెత్త పన్ను వసూలు చేసి వైసీపీ ప్రభుత్వం తన ప్రత్యేకతను చాటుకుంది.

సేవా రుసుము పేరుతో బాదుడు

గుంటూరు కార్పొరేషన్‌లో 2,17,544 ఇళ్లు ఉండగా వీటిలో 14,720 వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్టుగా గుర్తించి సేవా రసుము పేరుతో చెత్త పన్ను బాదేశారు. ఇంటికి రూ.60, హోటళ్లకు రూ.1000, బార్ అండ్ రెస్టారెంట్లకు రూ.2000, 40 పడకల ఆస్పత్రులకు రూ.7500, కల్యాణ మండపాలకు రూ.2500 నుంచి రూ.7500, విద్యా సంస్థలకు రూ.300 నుంచి 2000 వరకు చెత్త పన్నును అమలు చేశారు.


చెత్త పన్ను వసూలు మున్సిపాల్టీల వారీగా..

మునిసిపాల్టీ	వసూలు చేసిన పన్ను
నరసరావుపేట	96,54,888
చిలకలూరిపేట	1,16,98,990
మంగళగిరి, తాడేపల్లి	1,86,17,910
తెనాలి	3,61,31,720
బాపట్ల	59,16,790
చీరాల	1,05,18,470

అక్రమ మైనింగ్‌పై విస్తృత తనిఖీలు

- ఇప్పటికే 40 కోట్లకు పైగా అపరాధ రుసుము విధింపు

6లో..



అమరావతిలో.. పనుల సందడి



హైకోర్టు నుంచి హెచ్‌వోడీ క్వార్టర్స్ వరకు...






ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన అమరావతిలో పనుల హడావుడి మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో ఆగిపోయిన పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ అధికారులు రంగంలోకి దిగారు. రెండు రోజులుగా జరుగుతున్న పనులతో రాజధాని గ్రామాల్లో కూలీలు, యంత్రాల సందడి నెలకొంది. చిట్టడివిలా మారిన రాజధాని ప్రాంతంలో ముళ్ల కంపలను 76 ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నారు. ఉద్దండ్రాయుని పాలెంలో అమరావతికి మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగిస్తున్నారు. రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకుంటున్నారు. ఐఏఎస్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, హైకోర్టు జడ్జీల బంగ్లాల వద్ద పనులు చేపట్టారు. శనివారం సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ ఆయా పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు.

- తుళ్లూరు



పెదపరిమి నుంచి తుళ్ళూరు వెళ్లే రోడ్డులో పిచ్చి చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్‌లు



కేంద్ర మంత్రివర్గంలో.. చోటుదక్కేనా?

- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పెమ్మసాని పేరు
- సీనియర్ హోదాలో శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నాలు





గుంటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అనూహ్య విజయం సాధించిన ఎన్‌డీఏ కూటమి ఎంపీలలో కొందరికి కేంద్ర మంత్రివర్గంలో అడుగుపెట్టే అవకాశం వచ్చింది. కూటమిలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీ కూడా ఉండటంతో ఆ పార్టీ వారికి కూడా ఒకరిద్దరి కి అవకాశాలు దక్కనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కూటమి తరఫున ముగ్గురు ఎంపీలు ఎన్నికయ్యా రు. వారిలో గుంటూరు నుంచి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ గెలుపొందారు. ఎంపీగా తొలిసారే పార్లమెంటులోకి అడుగుపెడుతున్న ప్పటికీ మంచి మెజార్టీతో విజయం సాధించి గుంటూరు లోక్‌సభ స్థానంలో రికార్డు సృష్టించారు. పెమ్మసాని తన ప్రత్యర్థి కంటే 3 లక్షల 44వేల ఆధిక్యతతో విజయ ఢంకా మోగించారు. రాజకీయాలకు కొత్తైనప్పటికీ ఎంతో అనుభవి జ్ఞుడిగా అడుగులు వేసి లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంలో తన వంతు పాత్ర పోషించారు. ముఖ్యంగా గుంటూరు తూర్పు నియోజక వర్గంలో రెండు దశాబ్దాల తర్వాత టీడీపీ జెండా ఎగుర వేయటంలో పెమ్మసాని కీలకంగా వ్యవహరించారు. పైగా పార్టీ సుప్రీం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ ఈ ఎన్నికల్లో పార్టీకి ఆర్థికంగా అండగా నిలిచి మంత్రి రేసులో ముందంజలో ఉన్నారు. పైగా రాజధాని ప్రాంత ఎంపీ కావడంతో పెమ్మసానికి కేంద్ర మంత్రి పదవి దక్కితే అమరావతి అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందనే భావన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. నరసరావుపేట నుంచి రెండో సారి గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా కేబినెట్ మంత్రి పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న లావు తనకున్న అనుభవం దృష్ట్యా చంద్రబాబు తన పేరు కూడా పరిశీలిస్తారని ఆశిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకు చెందిన వల్లభనేని బాలశౌరి జనసేన తరఫున మచిలీపట్నం నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు. రెండో సారి పార్లమెంటులోకి అడుగుపెడుతున్న ఆయన కూడా మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సోషల్ మీడియాలో ఎంఈఓ ఫేక్‌పోస్టులు

● ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

పొన్నూరుటౌన్, జూన్‌8: ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్న విద్యాశాఖ అధికారి తీరు పట్ల ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పొన్నూరులో ఎంఈవోగా పని చేస్తున్న శోభచంద్.. వైఎస్ జగన్ ఫాలోయర్స్ పేరిట ఏర్పాటైన వాట్సప్ గ్రూప్‌లో పెట్టిన పోస్టులు తీవ్ర వివాదస్పదం అవుతున్నాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ చేశామని చంద్రబాబు ఒప్పుకుంటున్నాడు అన్న ట్యాగ్‌తో ఉన్న వీడియోను శోభచంద్ తన ఫోన్ నుంచి పోస్టు చేయటం ఉపాధ్యాయ వర్గాల్లో కలకలంగా మారింది. యూట్యూబ్‌లో వచ్చిన ఒక వీడియోను శోభచంద్ పోస్టు చేస్తూ ఈవీఎంలు అబ్రకదబ్ర అని కామెంట్ కూడా జోడించాడు. శోభచంద్ వైసీపీతో అంటకాగి గత ఐదేళ్లుగా ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేసినటట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారిన తన పంథా మార్చుకోలేదన్నారు. ఎంఈవో తీరు పట్ల విద్యాశాఖ అధికారులు కూడా గురుగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల సర్వీస్ రూల్స్ ఉల్లంఘించి ఉన్నతాధికారులకు తెలియకుండా విదేశీ పర్యటనలు సైతం చేయటం పట్ల ఎంఈవోకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఉపాధ్యాయులు గుసగుసలాడుకుంటున్నారు.



విద్యాశాఖ అధికారి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో స్క్రీన్ షాట్



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



కూటమి విజయంతో కోటప్పకొండకు పాదయాత్ర

నరసరావుపేట టౌన్, జూన్ 8: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో పట్టణంలో ఎన్‌జీవో కాలనీ నుంచి కొటప్పకొండ వరకు తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళలు శనివారం పాదయాత్ర చేశారు. ఎన్‌జీవో కాలనీలోని అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళ పాదయాత్రను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేగా అరవిందబాబు విజయం సాధించినందుకు ఈ పాదయాత్ర చేస్తున్నామని మహిళలు అన్నారు. పాదయాత్రగా కోటప్పకొండకు వెళ్ళి త్రికోటేశ్వరుని దర్శించుకొని మహిళలు మొక్కు తీర్చుకున్నారు.

అక్రమ మైనింగ్‌పై విస్తృత తనిఖీలు

ఇప్పటికే రూ.40 కోట్లకు పైగా అపరాధ రుసుము విధింపు

దాచేపల్లి, జూన్‌8: గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలు తవ్వకాలపై మైనింగ్‌శాఖ అధికారులు నిశితంగా దృష్టి సారించారు. వైసీపీ నాయకులు అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మైనింగ్ క్వారీలు చేపట్టారు. మరికొందరు నామమాత్రపు లీజులు తీసుకొని పదుల సంఖ్య ఎకరాల్లో మైనింగ్ క్వారీయింగ్ నిర్వహించారు. దీనిపై గత ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు అధికారులు మౌనం వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితులు మారి నూతన ప్రభుత్వం ఏర్పడటంతో అధికారులు గతంలో జరిగిన అక్రమాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సున్నపురాయి గనులకు పేరుగాంచిన దాచేపల్లి, పిడుగురాళ్ల తదితర గ్రామాలలో నిర్వహించిన క్వారీలపై దృష్టి సారించారు. పిడుగురాళ్ల మండలంలో లారీల్లో తరలిస్తున్న సున్నపురాయి లోడుతో వున్న మూడు లారీలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మండలాల్లో 40 మైనింగ్ క్వారీలున్నాయి. వీటిపై ఇప్పటివరకు 40 నుంచి 50 కోట్ల రూపాయల వరకు అపరాధ రుసుం విధించారు. ప్రధానంగా కోనంకి, కొండమోడు, కేశానుపల్లి, నారాయణపురం, నడికూడి, గామాలపాడు, తంగెడ, దాచేపల్లి, దైద తదితర గ్రామాలలో నిర్వహిస్తున్న క్వారీల్లో అవినీతి విలయతాండవం చేసిందని అధికారుల దృష్టికి వచ్చింది. దాచేపల్లి మైనింగ్ ఏడీ అశోక్‌బాబు ఆధ్వర్యంలో గురు, శుక్ర, శనివారాల్లో ఆయా క్వారీలలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు.



మైనింగ్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు పట్టుకున్న అధికారులు

ఎన్నికల కోడ్ ఉన్నా ఆగని తవ్వకాలు

సార్వత్రిక ఎన్నికలతో ఎన్నికల కోడ్ వున్నా ఎన్నికల ఫలితాలు వెల్లడించి ప్రభుత్వం మారినా మైనింగ్ తవ్వకాలు మాత్రం యథేచ్ఛగా జరగటం విశేషం. అధికారులు దాడులు చేపట్టడంతో పిడుగురాళ్లలో మూడు లారీలతో పాటు దాచేపల్లిలో మూడు ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ అక్రమదారులకు క్వారీల నుంచి వస్తున్న ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారుల ఆదేశాలను కూడా భేఖాతరు చేసి మైనింగ్ నిర్వహించడం విడ్డూరం. అధికారం మాదేనన్న ధీమాతో వైసీపీ నేతలు చేసిన అక్రమాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తు న్నారు. మరికొన్ని రోజుల్లో అక్రమ క్వారీయింగ్ జరిగిన ప్రాంతాలను గుర్తించి కోట్ల రూపాయల అపరాధ రుసుం విధించే అవకాశం వుంది. జిల్లా స్థాయి అధికారులు కూడా పల్నాడులో జరుగుతున్న మైనింగ్ అక్రమాలపై జిల్లా అధికారులు కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు.

పరారీలో అక్రమ మైనింగ్ వ్యాపారులు

మైనింగ్ అధికారులు క్వారీలపై దాడులు చేసి ఇప్పటివరకు జరిగిన క్వారీయింగ్‌పై వివరాలు సేకరిస్తుండటంతో అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేసి అక్రమార్జన చేసిన వైసీపీ నేతలు అందుబాటులో లేకుండా పోయారు. కనుచూపు మేరలో కూడా నేతలు కనపడకపోవడం జరిగింది. ఏళ్లతరబడి మైనింగ్ చేపట్ట డంతో ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు.

మల్లన్న సేవలో జస్టిస్ జ్యోతిర్మయి



జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు మల్లేశ్వరస్వామి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో ప్రసాదరావు

పెదకాకాని, జూన్ 8: గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దంపతులు శనివారం దర్శించారు. ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారికి అభిషేకం, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. అనంతరం జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈవో శ్రీరామ వరప్రసాద్ జస్టిస్ దంపతులకు మల్లేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు.

పశ్చిమ గోదావరిపై కృష్ణా ఘన విజయం



మెహెక్ (52 నాటౌట్)



రిషిక (60)

మంగళగిరి సిటీ, జూన్ 8: ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-19 మహిళల వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో కృష్ణా జిల్లా జట్టు పశ్చిమ గోదావరిపై 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కృష్ణా జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు సాధించింది. రిషిక కృష్ణన్ 123 బంతుల్లో 7 ఫోర్లతో 60 పరుగులు సాధించగా, కృష్ణా బౌలర్ లక్ష్మీ అపర్ణ 8 ఓవర్లలో పది పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జిల్లా జట్టు 31.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జాస్రా మెహెక్ 62 బంతుల్లో 9 ఫోర్ల సాయంతో 52 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది.

ఆ ఖాకీలు నా గడప తొక్కొద్దు!

● ఎస్‌ఐలను వెనక్కి పంపిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్‌8: అధికార మార్పిడి జరుగడంతో తెలుగుదేశం పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు కొందరు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అటువంటి ఆలోచనలతో వున్న కొందరు ఎస్‌ఐలకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నో ఎంట్రీ చెప్పారు. తనను కలిసేందుకు గుంటూరు దాకా వచ్చిన కొందరు ఖాకీలను ఇంటి బయట నుంచే పంపించివేశారు. వాళ్ల నన్ను కలవాల్సిన అవసరం లేదు.. నాతో మాట్లాడాల్సిన పనిలేదు.. గేటు వద్ద నుంచే పంపివేయండి అంటూ యరపతినేని గన్‌మెన్‌లకు చెప్పడంతో వైసీపీ భక్త ఎస్‌ఐలు మొఖం నేలకేసుకొని ఇంటిబాట పట్టారు. వైసీపీ పాలనలో అడ్డగోలుగా వ్యవహరించి.. ఆ పార్టీ నేతలు చెప్పిందే వింటామంటూ గురజాల నియోజకవర్గంలో కొందరు పోలీసు అధికారులు వ్యవహరించారు. వారు పేరుకే ఖాకీలు ధరించారు గానీ వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారు. టీడీపీకి చెందిన శ్రేణులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు.. చాలా మందిని విచక్షణారహితంగా కొట్టి అక్రమ కేసులు బనాయిస్తూ వైసీపీ నేతలు చెప్పిందల్లా చేసి తలలు ఆడించారు. ఆ పోలీసులకు ఇప్పుడు కనువిప్పు కలిగినట్లు, మారుమనసు పొందినట్లు నటిస్తున్నారు. పోలీసులు... పోలీసుల్లా వ్యవహరించాలంటూ అనేకసార్లు యరపతినేని సూచించినప్పటికీ... వైసీపీ నేతలకు తలలూపుతూ నేతలు చెప్పిందే వేదంలా పనిచేసిన ఎస్‌ఐలు ఇప్పుడు బిక్కమొఖం వేస్తున్నారు. వైసీపీ నేతలు కొందరు పోలీసుల చేత అన్ని తప్పులు చేయిస్తారు... ఆ తరువాత పట్టించుకోరని చెప్పినా కొందరు అధికార దర్పంతో వ్యవహరించి ఇప్పుడు తలలు పట్టుకున్నా ఉపయోగం ఏమిటంటూ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా గురజాల నియోజకవర్గంలో నియంతలా పనిచేసిన వారికి చట్టప్రకారం నడుచుకోవాలని సూచించినా కొందరు పెడచెవిన పెట్టారని, అలాంటి సీఐలకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనదైన శైలిలో వ్యవహరించినట్లు తెలుస్తుంది.



వాగులో పడి ఇద్దరు చిన్నారుల మృతి



ప్రసంగి (పాత చిత్రం)



ఈశ్వర్

పెదకూరపాడు, జూన్‌8: గేదెల వద్దకు వెళ్ళి ఇరువురు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని లింగంగుంట్లలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన కుక్కమళ్ళ ఏసుదాసు, కోటమ్మ దంపతుల రెండో కుమారుడు ప్రసంగి(15) 10వ తరగతి చదివాడు. సారెకుక్క నీలాంబరం, నాగమణి దంపతుల కుమారుడు ఈశ్వర్(14) 9వ తరగతి చదివాడు. వీరిరువురు శనివారం లింగంగుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలో 11 గంటల సమయంలో గేదెలు మేపేందుకు వెళ్ళారు. సాయంత్రం అవుతున్న ఇంటికి రాక పోవటంతో ఎన్నిసార్లు ఫోన్‌లు చేసినా వారి పిల్లలు ఫోన్‌లు స్పందించక పోవటంతో తల్లిదండ్రులు వెతికారు. సమీపంలోని జగడాల వాగు గట్టుపై బట్టలు ఉండటాన్ని గమనించి వాగులోకి దిగి వెతికారు. వాగులో దిగి చూడగా విగత జీవులుగా ఉన్నారు. వారిలో కొద్దిగా కదలిక వచ్చినట్టు భావించి పెదకూరపాడులోని వైద్యశాలకు తీసుకు రాగా ఈశ్వర్ మృతి చెందాడని డాక్టర్ ధ్రువీకరించారు. ప్రసంగిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఇరువురి కుటుంబాల్లో ఇరువురు మృతి చెందటంతో విషాదం నెలకొంది. వారి కుమారులు మృతి చెందటంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కంట తడి పెట్టించింది.

రామోజీరావు జీవితం ఆదర్శనీయం

ఎమ్మెల్యే ఆనందబాబు



రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆనంద్‌బాబు

వేమూరు, జూన్ 8: పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో తనదైన ముద్ర వేసి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప చేసిన వ్యక్తి రామోజీరావు అని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శనివారం గుంటూరు క్యాంప్ ఆఫీసులో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి క్రమశిక్షణతో అంచలంచలుగా ఎదిగిన రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఆయన మృతి తెలుగు వారికి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ధారూ నాయక్

గుంటూరు, జూన్ 8: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారునాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత, నారా లోకేష్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధారూ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభంజనానికి ప్రజలు ఏకపక్షంగా మద్దతు ఇవ్వడమే కారణమన్నారు. అదేవిధంగా గిరిజనులు సైతం కూటమికే జై కొట్టారన్నారు. గాడి తప్పిన ఆంధ్రప్రదేశ్‌ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించాలంటే చంద్రబాబు నాయుడు వల్లే అవుతుందని ప్రజలు బలంగా నమ్మారని అన్నారు.

కౌలురైతు ఆత్మహత్య


మాచవరం, జూన్‌8: అప్పులబాధ తట్టు కోలేక కౌలురైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అమీనుద్దీన్ తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన చవడ బోయిన బొర్రయ్య (58) తనకున్న 80 సెంట్లు పొలంతో పాటు మరో 4 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని రెండేళ్లుగా మిర్చి పంట సాగు చేస్తున్నాడు. అయితే పంటలు సక్రమంగా పండక, పండినా గిట్టుబాటు ధర లభించక సుమారు రూ.12 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అమీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాంబు దాడుల కేసులో 17 మంది అరెస్టు.. రిమాండ్

నకరికల్లు, జూన్ 8: ఎన్నికల పోలింగ్ రోజున నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో యాసిడ్ బాంబులతో దాడి చేసిన కేసులో 17 మంది నిందితులను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ కే.నాగేంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

కృష్ణా పుష్కర ఘాట్‌లో రామోజీ సైకత శిల్పం

తాడేపల్లి టౌన్, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు నివాళులర్పిస్తూ సైకత శిల్పాన్ని గుంటూరు జిల్లా సీతానగరంలోని పుష్కర ఘాట్‌లో ప్రముఖ సైకత శిల్పి వరప్రసాద్ ఏర్పాటు చేశారు. దాదాపు మూడు గంటలు శ్రమించి ఇసుకతో ఈ శిల్పాన్ని నిర్మించారు. అసమాన్యుడికి అశ్రునివాళి అంటూ ఏర్పాటు చేసిన ఈ శిల్పాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు.




రాష్ట్రానికి పట్టిన జగన్ పీడ విరగడైంది



నరసరావుపేట టౌన్, జూన్‌8: రాష్ట్రంలో కూటమి విజయం, జగన్‌మోహన్‌రెడ్డి ఓటమితో రాష్ట్రానికి పట్టిన పీడ విరగడైందని ప్రజలు భావిస్తున్నారని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ అరాచక పాలన పోయి అభివృద్ధి పాలన మొదలు అవుతుందని ప్రజలు సంతోషంగా ఎదురు చూస్తున్నారని అన్నారు. కేంద్రంలో చంద్రబాబునాయుడు కీలకంగా ఉన్నారని తెలిపారు. జాతీయ మీడియాలో కూడా చంద్రబాబు ఉన్నతిని కొనియాడుతున్నారని చెప్పారు. ఇటీవల వరకు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన తనకు పల్నాడు జిల్లాలో ఏడు అసెంబ్లీలలో విజయం సాధించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కూటమి విజయంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. చంద్రబాబునాయుడు సహకారంతో పల్నాడు వాటర్ గ్రిడ్ పూర్తిచేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజాసమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, భగవంతుడు, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తానన్నారు, భారీ మెజారిటీతో పల్నాడు ప్రజలు ఇచ్చిన విజయాన్ని మరచిపోలేనన్నారు. సమావేశంలో గొట్టిపాటి జనార్ధన్‌బాబు, రాపర్ల జగ్గారావు, దాసరి ఉదయశ్రీ, కోట నాగసుధీర్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి బత్తుల రాజీనామా



రాజీనామా చేస్తున్న దేవానంద్

గుంటూరు(తూర్పు), జూన్ 8: ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు బత్తుల దేవానంద్ తెలిపారు. గుంటూరు, అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల పదవి కాలంలో జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గ్రంథాలయాలకు రావాల్సిన రూ.20కోట్ల సెస్సును వసూలు చేసామని గుర్తుచేశారు. నిధులతో పాటు దాతల సహకారంతో జిల్లా గ్రంథాలయంలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. తనకు సహకరించిన సిబ్బంది, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం



నాటక పోటీలోని ఓ సన్నివేశం

పొన్నూరుటౌన్, జూన్8: పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళా ప్రాంగణంలో శనివారం 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. నన్నపనేని చంద్రమౌళీశ్వరి నటరాజ పూజలు చేసి పోటీలను ప్రారంభించారు. గిద్దల్లూరి శరద్మతి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం అలరించింది. తొలి నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటికను ఎం.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించారు. రెండవ నాటికగా మైత్రి కళా నిలయం విజయవాడ వారి బంధం సాంఘిక నాటికను ప్రదర్శించారు. మూడో నాటికగా నిశబ్దమా నీ ఖరీదెంత అనే నాటికను పిటి మాధవ్ రచనలో చెలసాని కృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించారు. తొలి రోజు నాటికల పోటీలు నాటక రంగ ప్రియులను విశేషంగా ఆకర్షించాయి. ఆహ్వాన నాటిక పోటీలను కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు నాయుడు గౌరవ అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు పర్యవేక్షించారు. సత్యహరిశ్చంద్ర, కాటి సీను పద్యాలాపనను కె.సాంబయ్య ప్రదర్శించారు. పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన నాటక రంగ ప్రియులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాటిక పోటీలను తిలకించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

పల్నాడు వార్తలు



హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న యరపతినేని

పత్రికా రంగానికి చీకటి రోజు

● రామోజీరావు మృతికి యరపతినేని ఘన నివాళులు

పిడుగురాళ్ల, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు ఆకస్మిక మరణం పత్రికా లోకానికి చీకటి రోజని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివ దేహం వద్ద యరపతినేని శ్రీనివాసరావు నివాళులర్పించారు. అక్షరమే ఆయుధంగా అనేక సంవత్సరాలుగా ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని రామోజీరావు సేవలను యరపతినేని కొనియాడారు.

తెలుగు జాతికి దురదృష్టకర దినం : కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: రామోజీరావును కోల్పోవటం తెలుగు జాతికి దురదృష్టకరమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు పత్రిక సాహితీ రంగంలో సంచలనానికి నాంది పలికిన ఈనాడు, సితార, చతుర, విపుల మరువలేనివన్నారు. రైతు బంధు అన్నదాత రామోజీరావు మానస పుత్రికలు అన్నారు. మార్గదర్శి అందరికీ తోడగా నిలబడి ఆర్థిక స్వావలంబన దిశగా సాయ పడిందన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ తెలుగు వారి సత్తా ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ఈటీవీ హుందాగా కథనాలు ఇచ్చిందన్నారు. ఆంధ్ర రాజకీయాల్లో రామోజీరావు పత్రికల ద్వారా పెను మార్పులు తెచ్చారన్నారు. తెలుగు రాష్ట్రాలకు రామోజీరావు అందించిన సేవలు చిర స్మరణీయమన్నారు.

పట్టణంలోని రఘు రామ్‌నగర్‌లో గల టీడీపీ ప్రజావేదికలో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఎలినేడి రామస్వామి, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ నేతలు ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా తదితరులు పాల్గొని రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో

తెలుగు వారి ఖ్యాతిని చాటిన రామోజీరావు : జూలకంటి

మాచర్లటౌన్ : 'తెలుగు వారి ఆత్మగౌరవాన్ని అన్న నందమూరి తారక రామారావు నిలబెడితే తెలుగు వారి ఖ్యాతిని దశదిశగా చాటింది ఈనాడు రామోజీరావు.. అలాంటి మహనీయుడు ఇక లేరంటే నమ్మలేకున్నాం.. ఆయన ఆత్మకు శాంతి కలగాలి' అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం జూలకంటి బ్రహ్మారెడ్డి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ బాబుతో కలిసి హైదరాబాద్‌లో ఫిలింసిటీలో రామోజీరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రామోజీరావు పెద్ద కుమారుడు కిరణ్‌కు సాను భూతిని తెలిపారు. అలాగే టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చిరుమామిళ్ల మధుబాబు రామోజీరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

పలువురి నేతల నివాళులు ..

నకరికల్లు : స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కారంపూడి: పత్రికా, సినీ రంగాలకు వన్నె తెచ్చిన ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావుకు మండల కేంద్రమైన కారంపూడిలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

పెదకూరపాడు: టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు, బీసీసెల్ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్‌లు రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. ఈనాడు అధినేత రామోజీరావు అకాలమృతి వారి కుటుంబానికి తీరని లోటు అని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. పెదకూరపాడులో చెరుకూరి రామోజీరావు చిత్రపటం వద్ద శనివారం నివాళులర్పించారు.

అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నేతలు శ్రీనివాసరావు, కోటయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

బెల్లంకొండ : ఈనాడు అధినేత రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు అని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్ర మైన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, పార్టీ నేతలు మక్కపాటి రామచంద్రరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ శేషగిరి కుమారి తదితరులు రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

పిడుగురాళ్ల : పత్రికారంగంలో విశిష్ట సేవలందించిన రామోజీరావు ఆకస్మిక మరణం బాధాకరమని పిడుగురాళ్ల పాత్రికేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో రామోజీరావు చిత్రపటానికి పలువురు పాత్రికేయులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ బాబావలి, పాండురంగ శ్రీను, ఎల్‌వీఆర్, మల్లెల ఆదినారాయణ, సయ్యద్ అమీర్‌అలి, వల్లెపు రామకృష్ణ, చిలకా చిన్న, కుంచపు గంగరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.



కోటప్పకొండ వరకు పాదయాత్రకు తరలి వెళ్తున్న తెలుగు మహిళలు

కోటప్పకొండకు తెలుగు మహిళల పాదయాత్ర

● కూటమి విజయంతో మొక్కులు చెల్లించి పూజలు..

నకరికల్లు, జూన్ 8 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించటంతో మండలంలోని కండ్లకుంట గ్రామానికి చెందిన తెలుగు మహిళలు కోటప్పకొండకు వెళ్ళి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేశంలో, రాష్ట్రంలో కూటమి అపూర్వ ఘనవిజయం సాధించటంతో త్రికోటేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు మహిళలు శనివారం కండ్లకుంట నుంచి పాదయాత్ర చేపట్టారు. దేశం, రాష్ట్రం పాడిపంటలతో, సుఖసంతోషాలతో జీవించే వాతావరణం కల్పించాలని త్రికోటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కండ్లకుంటలో పాదయాత్రకు వెళ్ళే తెలుగు మహిళలకు రావెల సత్యనారాయణ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గంగవరపు విశ్వేశ్వరరావు, రావెల లింగయ్య చౌదరి, పాలడుగు శ్రీనివాసరావు, కాట్రగడ్డ రామాంజనేయులు, ఎండూరి శ్రీ ఆంజనేయులు, అత్తులూరి కోటేశ్వరి, వట్టికుంట లక్ష్మి, ఎండూరి శౌరీలు, వెంపటి సంధ్య, గాలి శ్రీలక్ష్మి, గంగవరపు బ్రహ్మేశ్వరి, వెంపటి అనురాధ, చంద్ర నిర్మల, రమణి, అన్నపూర్ణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకొని గుంటూరు తూర్పు నియోజక వర్గానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు గుంటూరు నుండి తెలంగాణలోని మట్టపల్లి నరసింహస్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. శనివారం పిడుగురాళ్ల మీదుగా దాచేపల్లి, తంగెడ మీదుగా మట్టపల్లికి పాదయాత్రను కొనసాగించారు. గుంటూరు తూర్పుకు చెందిన దేవరశెట్టి శ్రీనివాసరావు, కోకా పిచ్చయ్యలు పాదయాత్రగా వెళ్తున్నారు.



సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలో నిలిచిన జూలకంటి బ్రహ్మారెడ్డి అఖండ మెజార్టీతో గెలుపొందటంతో టీడీపీ కార్యకర్త ఈర్ల సురేష్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, రింగురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో 101 కొబ్బరికాయల కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

- మాచర్ల రూరల్

ప్రతి రౌండ్‌లో కూటమిదే ఆధిక్యం

● పిన్నెల్లిపై జూలకంటిదే పైచేయి..

● గతంలో ఏ అభ్యర్థికి దక్కని మెజార్టీతో భారీ విజయం

మాచర్లటౌన్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో ప్రతి రౌండ్ లోనూ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధిక్యత సాధించారు. మొత్తం 22 రౌండ్లకు గాను అన్ని రౌండ్లలో కూటమిదే పైచేయిగా నిలిచింది. జూలకంటి బ్రహ్మారెడ్డికి 120953 ఓట్లు రాగా ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి 87635 ఓట్లు లభించాయి. బ్రహ్మారెడ్డి 33318 ఓట్ల భారీ మెజార్టీ సాధించారు. మాచర్ల నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ అభ్యర్థికి కూడా ఈస్థాయి మెజార్టీ దక్కలేదు. అలాగే ఈ సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు జిల్లాలోనే అత్యధిక మెజార్టీ సాధించి ప్రథమస్థానంలో నిలిచారు బ్రహ్మారెడ్డి.. రౌండ్ల వారీగా కౌంటింగ్ వివరాలు ఇలా ఉన్నాయి...



ప్రజలకు అభివాదం తెలుపుతున్న జూలకంటి బ్రహ్మారెడ్డి (ఫైల్)

రౌండు సంఖ్య	బ్రహ్మారెడ్డి (కూటమి)	పీఆర్కే (వైసీపీ)	రౌండు సంఖ్య	బ్రహ్మారెడ్డి (కూటమి)	పీఆర్కే (వైసీపీ)
1	4238	3436	12	5737	4017
2	6627	4745	13	6376	3931
3	5920	5419	14	5334	4418
4	6276	4029	15	3952	2938
5	7815	3616	16	5038	3919
6	7417	3409	17	4120	3344
7	6346	3028	18	4483	5018
8	5472	3692	19	5202	4784
9	3181	6335	20	6797	4432
10	6192	3701	21	5517	3536
11	5950	4782	22	1669	1106

మండలాల వారీగా ఆధిక్యత ..

మాచర్ల నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో వైసీపీకి, 2024 ఎన్నికల్లో కూటమికి లభించిన ఆధిక్యతను పరిశీలిస్తే ..

	2019 (వైసీపీ)	2024 (కూటమి)
మాచర్ల మండలం	5487	4462
మాచర్ల పట్టణం	196	12495
వెల్దుర్తి	5645	1524
దుర్గి	1255	5842
రెంటచింతల	5458	1457
కారంపూడి	3516	6544

ఆలయాల్లో భాష్యం ప్రవీణ్ ప్రత్యేక పూజలు



అత్తలూరు రామాలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు

అమరావతి, జూన్8: పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన భాష్యం ప్రవీణ్ కుటుంబ సభ్యులతో కలసి శనివారం మండల పరిధిలోని అత్తలూరు, వైకుంఠపురం గ్రామాలలోని ఆలయాలలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా అత్తలూరులోని రామాలయంలో స్వామివార్లకు అర్చకులు శ్రీపతి బాలకృష్ణమాచార్యులు, ద్వారకనాధాచార్యులు పూజలు నిర్వహించి ప్రవీణ్ లావణ్య దంపతులకు ఆశీర్వచనం చేశారు. అనంతరం వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ఆశీర్వచనం పొందారు. ఇదే కార్యక్రమంలో గ్రామానికి చెందిన వెంగిశెట్టి వెంకటేశ్వరరావు 108 కొబ్బరికాయలు కొట్టి ప్రవీణ్ దంపతుల సమక్షంలో తన మొక్కు తీర్చుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే ప్రవీణ్ గ్రామంలోని మహాత్మాగాంధీ, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రవీణ్ సోదరులు నవీన్, కొండవీటి పాపారావు, కిషోర్, భాష్యం వీరాంజనేయులు, మండల పరిధిలోని కూటమి నేతలు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుండటంతో మండల పరిధి గ్రామాల నుండి ప్రజలు మల్లాదిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంను శనివారం అధిక సంఖ్యలో సందర్శించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరము స్వామివారి శాంతి కళ్యాణంలో పాల్గొని భక్తి పారవశ్యం పొందారు. వెంకటేశ్వరుని దయ వలన ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ఆపార్టీ ఓటమితో ప్రజలకు విముక్తి కలిగిందని అందుకే స్వామివారిని దర్శించుకోవడం జరిగిందని పలువురు భక్తులు తెలియజేశారు.



మల్లాది వెంకన్న ఆలయంలో స్వామివారి కళ్యాణం తిలకిస్తున్న భక్తులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సత్తెనపల్లి, జూన్ 8 : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఏరియా వైద్యశాల హెడ్‌నర్స్ బంగారు పాప సూచించారు. శనివారం వైద్యశాలలోని గర్భిణీలకు ఆరోగ్య అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలు మానసికంగా, ప్రశాంతంగా ఉండాలన్నారు. ప్రతిరోజు పాలు, గుడ్డు తీసుకోవాలన్నారు. ఆహారంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. కాన్పుకి ఆస్పత్రికి వచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా నెంబరు పుస్తకం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మాధవి, శివపార్వతి పాల్గొన్నారు.

8ఎన్‌కేఎల్2, కే నాగేంద్రరావు

నకరికల్లు ఎస్ఐగా నాగేంద్రరరావు



ఎస్ఐ నాగేంద్రరావు

నకరికల్లు, జూన్8: నకరికల్లు ఎస్ఐగా నాగేంద్రరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అమరావతి నుంచి ఆయన బదిలీపై నకరికల్లు ఎస్ఐగా విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌పూర్తయి ఎన్నికల ఫలితాలు వెలువడి ప్రభుత్వం ఏర్పడబోతోందన్నారు. ప్రజలు ఎవ్వరూ ఎలాంటి ఆవేశాలకులోను కాకుండా శాంతియుతంగావ్యవహరించాలని ఎస్ఐ నాగేంద్రరావు కోరారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన పీ.రాంబాబు వ్యక్తి గత కారణాలతో సెలవుపై వెళ్ళారు.

ట్రావెలర్స్ బంగ్లాలో మంచాలు మాయం

అచ్చంపేట, జూన్ 8 : మండల కేంద్రమైన అచ్చంపేటలోని ట్రావెలర్స్ బంగ్లాలో ఖరీదైన డబుల్ కాట్ మంచాలు మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంగ్లా తలుపులకు వేసి ఉంచిన తాళాలను పగల గొట్టి, బంగ్లాలోని డబుల్ కాట్ మంచాలతో పాటు పరుపులు చోరీకి గురయ్యాయి. తెలుగుదేశం పార్టీ నాయకుడు కొనకంచి యజ్ఞప్రసాదు ఈ విషయంపై మాట్లాడుతూ ట్రావెలర్స్ బంగ్లాలో చోరీ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణ

సత్తెనపల్లి, జూన్ 8: 'రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ఆవశ్యకత' అన్న పుస్తకాన్ని శనివారం సత్తెనపల్లి పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావును అభినందనందిస్తూ సత్కరించారు. ఈ పుస్తకంలోని అంశాలను పామలుయ్య వివరించారు. కార్యక్రమంలో పూజల వెంకట కోటయ్య, దివ్వెల శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తీర్పును సిరసావహిస్తా

● గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల, జూన్ 8: గురజాలలో ఓటమిని ప్రజల తీర్పుగా భావించి సిరసావహిస్తానని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో కొంత ప్రగతిని సాధించా మన్నారు. కొద్దిరోజుల తర్వాత ఓటమికి గల కారణాలపై విశ్లేషిస్తా మని తెలిపారు. గ్రామాలలో ఏ పార్టీ నాయకులైనా గొడవలకు పాల్పడకుండా పోలీసులు బాధ్యత తీసుకోవాలన్నారు.

వైసీపీ కోవర్టులను బహిష్కరించాలి

● యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోపి

పెదకూరపాడు, జూన్ 8 : జగన్‌మోహన్‌రెడ్డి ఓటమిని సహించలేని కాంగ్రెస్ పార్టీలోని కొందరు వైసీపీ కోవర్టులు షర్మిలారెడ్డిపై ఇష్టాను రీతిగా మాట్లాడటం దుర్మార్గమని జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘంటా గోపి అన్నారు. శనివారం పెదకూరపాడులోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయటమే షర్మిల ఏకైక కర్తవ్యమని, వార్డు మెంబర్లుగా గెలవలేనివారు షర్మిలపై విమర్శలు చేసేవారా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో వైసీపీ కోవర్టులుగా ఉన్న వారిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం సుభానీ, పార్టీ నేతలు అబ్దుల్ రహీం, ముక్కెర ఉదయ్ శంకర్, షేక్ మౌలి, పులిగొండ వెంకటరావు, ఘంటా తిరుపతిరరావు, జమ్మిశెట్టి మారుతీనాయుడు, బలుసుపాటి గోపీ తదితరులు పాల్గొన్నారు.

మాలల సమస్యలపై పోరాడాలి

● మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్

వినుకొండ, జూన్ 8: నియోజకవర్గంలో మాలల సమస్యలపై పోరాడాలని రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ పిలుపునిచ్చారు. మాల మహానాడు కార్యాల యంలో శనివారం నియోజకవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు వినుకొం డ నియోజకవర్గం మాల మహానాడు వర్కింగ్ అధ్యక్షుడిగా వినుకొండ మండలం గోనుగుంట్ల వారిపాలెంకి చెందిన కోట్టే వెంకట్రావును నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ తెలిపారు. అనంతరం వెంకట్రావుకు నియామకప త్రం అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌పాల్ మాట్లాడుతూ నేటి నుంచి జాతీ య, రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తూ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని గ్రామ, గ్రామానికి తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఉద్యోగులు, మహిళల, విద్యార్థుల, కార్మిక, కర్షకుల కమిటీలు ఏర్పాటుచేయాలని, మాలల సమస్యలపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో కొండ్రు విజయ్, రాయని చిన్న, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కన్నా విజయంతో మొక్కు చెల్లించిన ప్రజలు

● దేవరంపాడు నేతి వెంకన్న స్వామికి పూజలు నిర్వహించిన టీడీపీ కూటమి నేతలు, మహిళలు

రాజుపాలెం,జూన్8:సాదరణ ఎన్నికలలో సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అఖండ మెజార్టీతో విజయం సాధించటంతో రాజుపాలెం మండలంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు సంబరాలు జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన సుమారు 150మంది నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాదయాత్రగా దేవరంపాడు శ్రీనేతి వెంకన్న స్వామివద్దకు చేరుకుని ప్రత్యేక పూజలుచేసి మొక్కు చెల్లించుకున్నారు. ఈ పాదయాత్రలో కన్నా లక్ష్మీనారాయణ తనయులు, మాజీ మేయర్ నాగరాజు పాల్గొన్ని వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు త్వరలో విస్తరించబోయే మంత్రివర్గంలో కన్నా లక్ష్మీనారాయణకు చోటు లభించాలని, రాజధాని అభివృద్ధిలో కన్నా ముఖ్య భూమిక పోషించాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ పాదయాత్రలో టీడీపీ నేతలు సులగా వెంకటప్పరావు, మాజీ సర్పంచ్‌లు అల్లంశెట్టి ఆనందరావు, దుద్దు అప్పారావు, వేల్పుల వెంకయ్య, కస్తాల దాసు తదితరులు పాల్గొన్నారు.



మొక్కు చెల్లించుకున్న ఉప్పలపాడు కూటమి నేతలు, మహిళలు

యరపతినేని భారీ కటౌట్



పిడుగురాళ్లలో పార్టీ శ్రేణులు ఏర్పాటు యరపతినేని కటౌట్

పిడుగురాళ్ల, జూన్ 8: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు గురజాలలో ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ శ్రేణులు పిడుగురాళ్లలో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి ప్రాంతాలలో యరపతినేని కటౌట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ శ్రేణులు దేవాలయాల్లో, మసీదుల్లో, చర్చిల్లో ప్రత్యేక పూజలు, మొక్కుల చెల్లింపులు జరుపుకుంటున్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుండి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు గుంటూరు తరలివెళ్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

నారా లోకేశ్‌కు అభినందనలు



నారా లోకేశ్‌కు బొకే అందిస్తున్న వట్టికూటి సైదారావు

పెదకూరపాడు, జూన్ 8 : మంగళగిరి శాసన సభ్యులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శరవణ్ అగ్రిటెక్ కోల్డ్ స్టోరేజ్ ఎండీ వట్టికూటి సైదారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని లోకేశ్ గృహంలో శనివారం కలసి రాష్ట్రంలో కూటమి విజయంతో పాటు మంగళగిరిలో భారీ మెజార్టీతో విజయం సాధించిన లోకేశ్‌ను శాలువాత సత్కరించి బొకే అందించి అభినందనలు తెలిపారు.



కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకుంటున్న గుత్తికొండ టీడీపీ నాయకులు

నేతి వెంకన్నకు 1001 కొబ్బరికాయలు..

● యరపతినేని గెలుపుతో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

పిడుగురాళ్ల, జూన్8: గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు గెలుపుతో గుత్తికొండకు చెందిన టీడీపీ నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం దేవరంపాడుకొండపై వేంచేసియున్న శ్రీనేతి వెంకన్నస్వామి దేవాలయం వద్ద పావులూరి కోటయ్య ఆధ్వర్యంలో 1001 కొబ్బరికాయలు కొట్టి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. గుత్తికొండకు చెందిన టీడీపీ నాయకులు పావులూరి కోటయ్య, మాజీ ఎంపీపీ యడ్లపల్లి నారాయణ, శివ, బండ్ల శేఖరయ్య, గూడూరి ఆంజనేయులు, చిన్నోడు, ప్రవీణ్, సుభానితో పాటు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వీ కనకయ్య

ప్రజలు శాంతి యుతంగా ఉండాలి

అచ్చంపేట, జూన్8:గ్రామాల్లోని ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలని ఎస్ఐ వీ.కనకయ్య అన్నారు. అచ్చంపేటలో శనివారం సీఐ ఎస్‌కే కరిముల్లా షావలి ఆధ్వర్యంలో ఎస్ఐ కనకయ్య అచ్చంపేట సెంటర్‌లో ప్రజల కు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ప్రజలందరూ శాంతి యుతంగా ఉంటూ కలసిమెలసి జీవించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు. అల్లర్లకు పాల్పడటం వలన కేసుల్లో ఇరుక్కొని కుటుంబాలకు దూరమవు తారని హెచ్చరించారు. ఎస్ఐతో పాటు పలువురు పోలీసులు ఉన్నారు.



పెదకూరపాడులో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఐ వెంకటరావు

సమాజ సేవకు ముందుకు రావాలి

పెదకూరపాడు, జూన్ 8: సమాజానికి సేవలే మార్గదర్శకమని పెదకూరపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ విప్పర్ల వెంకటరావు అన్నారు. పెదకూరపాడులో శనివారం జన చైతన్య సమితి ఆధ్వర్యంలో కోటప్పకొండ శాలి వాహన అన్నదాన సత్రం ఉపాధ్యక్షులు, రాష్ట్ర టీడీపీ నేత మోదుగుల చంద్రశేఖర్, ఉద్యోగి ఎరడేశి వీరాస్వామిల సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజ సేవల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామ్‌జీ నాయక్, జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు, నిర్వాహకులు కొర్రపాటి వెంకటేశ్వర్లు, వెలితోటి అనీల్ కుమార్, షేక్ లియాకత్ ఆలీ, గుడిపూడి బ్రహ్మనాయుడు, సొంగా జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దివ్య బలి పూజలో పాల్గొన్న రెవరెండ్ ఫాదర్ పోపూరి ప్రకాష్, గురువులు

క్రైస్తవులు ఇతరులకు ఆదర్శంగా ఉండాలి

అచ్చంపేట, జూన్ 8 : క్రైస్తవులు ఇతరులకు ఆదర్శంగా ఉండాలని తాళ్ళచెరువు విచారణ గురువు రెంవరెండ్ ఫాదర్ డాక్టర్ పుట్టి అంతోని రాజు అన్నారు. శనివారం తాడువాయి గ్రామానికి చెందిన నూతన గురువు రెవరెండ్ ఫాదర్ ప్రకాష్ మొదటి దివ్యబలి పూజ సందర్భంగా అనేక మంది మత గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన దివ్యబలి పూజలో రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పుట్టి అంతోని రాజు మాట్లాడుతూ ప్రజలు దేవుని మీద ఆధార పడాలని, ప్రతి ఒక్కరు ప్రార్ధనల్లో ఉండాలని పిలుపు నిచ్చారు. క్రైస్తవులు ఆదర్శవంతంగా జీవించాలని ఆయన కోరారు. తిరుకుటుంబ దేవాలయంలో జరిగిన దివ్యబలి పూజలో రెవరెండ్ ఫాదర్ బెనడిక్ట్ సభ రెవరెండ్ ఫాదర్ జేమ్స్, ఇటలీకి చెందిన రెవరెండ్ ఫాదర్ శౌరి, రెవరెండ్ మందా అంతోనిరోజు తదితర గురువులు పాల్గొన్నారు. కన్యా స్త్రీలు, గురువులు సుమారు 40మందికి పైగా పాల్గొన్న ఈ దివ్య పూజలో మరియదళ సభ్యులు, ఆర్‌సీఎం క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం ప్రేమ విందు జరిగింది.

ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిస్తున్నాము

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, జూన్ 8: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం, తన కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు అని ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డు నందుగల వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి, నరసరావుపేట కూటమి అభ్యర్థి చదలవాడ అరవింద్ బాబుకు నా ప్రత్యేక అభినందనలు.. అని తెలిపారు. ఎన్నికల ఫలితాలు చూశాక వైసీపీ కార్యకర్తలు ఎంతో నిరుత్సహపడ్డారని అన్నారు. ప్రజల తీర్పును శిరసా వహించి, స్వాగతిస్తున్నామని అన్నారు. వైసీపీ కార్యకర్తలు అధైర్య పడవద్దు.., నిరుత్సాహపడవద్దు మీకు నేను అండగా ఉంటాను.. కార్యకర్తలకు అందుబాటులో ఉంటాను.. అని చెప్పారు. వైసీపీ కార్యకర్తలు అందరూ సమన్వయం పాటించండి. ఎన్నికల ఫలితాలు తరువాత జరిగిన దాడులపై ఎస్పీకి పిర్యాదు చేశామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చదలవాడ అరవింద్‌బాబుకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ వారికి నా విజ్ఞప్తి.. మీకు ప్రజలు బాధ్యత అప్పగించారు ఎటువంటి అల్లర్లు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని.. నరసరావుపేట అభివృద్ధికి మా సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. గెలిచినా.. ఓడినా.. తాను ప్రజల మనిషిని అని.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు..

పంట ఉత్పత్తుల దొంగలను గుర్తించాలి

● ఏపీ రైతుసంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రాము



కృష్ణాపురంలో చోరీకి గురైన పొగాకు పొలాన్ని పరిశీలిస్తున్న రాము

కృష్ణాపురం(శావల్యాపురం), జూన్ 8: రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండిస్తున్న పంట ఉత్పత్తులను చోరీ చేస్తున్న వారిని పోలీసులు వెంటనే గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురానికి చెందిన గడిపూడి ప్రసాద్ పొలంలో గత గురువారం రాత్రి పొగాకు బేళ్ల చోరీకి గురవ్వడంతో రైతు సంఘం నాయకులు శనివారం కృష్ణాపురానికి వెళ్లి పొలాన్ని పరిశీలించారు. రాము మాట్లాడుతూ రైతులు పొలాల్లో నిల్వ ఉంచిన పంట ఉత్పత్తులు, వ్యవసాయ పనిముట్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్న ఘటనలు రెండేళ్లుగా వినుకొండ ప్రాంతంలో పెరిగిపోయాయని, పెట్టుబడులు పెరిగిపోయి రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే పంట ఉత్పత్తులకు కూడా రక్షణ లేకపోతే రైతులు వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నించారు. రైతులు పొలాల్లో సీసీ కెమెరాలు పెట్టుకోవలసిన దారుణ పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాలో ఇటీవల పిడుగుపాటుకు గురై అనేక మంది రైతులు ప్రాణాలను కోల్పోయారని, ప్రభుత్వం వారికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శావల్యాపురంలో ఎస్ఐ సురేష్‌ను కలసి పొగాకు బేళ్ళు చోరీ చేసిన నిందితుల్ని వెంటనే గుర్తించాలని కోరారు. ఆయనతో పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, గడిపూడి ప్రసాద్, రైతులు ఉన్నారు.

ఆరు మొబైల్ ఫోన్‌లు రికవరీ



రికవరీ చేసిన మొబైల్ ఫోన్‌లను బాధితులకు అందజేస్తున్న పోలీసులు

చిలకలూరిపేట, జూన్ 8: చిలకలూరిపేట అర్బన్ పోలీసుస్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న ఆరుగురు బాధితులకు శనివారం పోలీసులు వాటిని కనుగొని అప్పగించారు. ఈ మధ్యకాలంలో మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకుంటున్న పలువురికి టెక్నాలజీ ఆధారంగా వాటిని గుర్తించి అందజేస్తున్న విషయం విదితమే. అర్బన్‌స్టేషన్ సీఐ పీ రమేష్ బాధితులకు ఈ ఫోన్‌లను అందజేశారు.

మోకాళ్లపై మొక్కులు తీర్చుకున్న తెలుగుమహిళ



మోకాళ్లపై నడుస్తూ మొక్కు తీర్చుకుంటున్న తెలుగుమహిళ మల్లేశ్వరి

బొల్లాపల్లి, జూన్ 8 : చంద్రబాబు సీఎం కావాలని, జీవీ ఆంజనేయులు ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా మండలంలోని వడ్డెంగుంట గ్రామానికి చెందిన తెలుగుమహిళ కందుల మల్లేశ్వరి మోకాళ్లపై యాత్రను తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు ప్రారంభించారు. వడ్డెంగుంట గంగమ్మ గుడి నుంచి రెండు కిలో మీటర్లు మోకాళ్ల యాత్ర చేసి దాసర్లపల్లి పాటిమీద ఆంజనేయస్వామి గుడికి చేరుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెంగుంట కార్యకర్తలు, తెలుగుమహిళ, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.



కోటప్పకొండ వరకు పాదయాత్రకు తరలి వెళ్తున్న తెలుగు మహిళలు

కోటప్పకొండకు తెలుగు మహిళల పాదయాత్ర

● కూటమి విజయంతో మొక్కులు చెల్లించి పూజలు..

నకరికల్లు, జూన్ 8 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించటంతో మండలంలోని కండ్లకుంట గ్రామానికి చెందిన తెలుగు మహిళలు కోటప్పకొండకు వెళ్ళి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేశంలో, రాష్ట్రంలో కూటమి అపూర్వ ఘనవిజయం సాధించటంతో త్రికోటేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు మహిళలు శనివారం కండ్లకుంట నుంచి పాదయాత్ర చేపట్టారు. దేశం, రాష్ట్రం పాడిపంటలతో, సుఖసంతోషాలతో జీవించే వాతావరణం కల్పించాలని త్రికోటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కండ్లకుంటలో పాదయాత్రకు వెళ్ళే తెలుగు మహిళలకు రావెల సత్యనారాయణ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గంగవరపు విశ్వేశ్వరరావు, రావెల లింగయ్య చౌదరి, పాలడుగు శ్రీనివాసరావు, కాట్రగడ్డ రామాంజనేయులు, ఎండూరి శ్రీ ఆంజనేయులు, అత్తులూరి కోటేశ్వరి, వట్టికుంట లక్ష్మి, ఎండూరి శౌరీలు, వెంపటి సంధ్య, గాలి శ్రీలక్ష్మి, గంగవరపు బ్రహ్మేశ్వరి, వెంపటి అనురాధ, చంద్ర నిర్మల, రమణి, అన్నపూర్ణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకొని గుంటూరు తూర్పు నియోజక వర్గానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు గుంటూరు నుండి తెలంగాణలోని మట్టపల్లి నరసింహస్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. శనివారం పిడుగురాళ్ల మీదుగా దాచేపల్లి, తంగెడ మీదుగా మట్టపల్లికి పాదయాత్రను కొనసాగించారు. గుంటూరు తూర్పుకు చెందిన దేవరశెట్టి శ్రీనివాసరావు, కోకా పిచ్చయ్యలు పాదయాత్రగా వెళ్తున్నారు.


కుళాయిల్లోనూ కుమ్మేశారు

● అక్రమంగా కుళాయి కనెక్షన్‌లు

● మున్సిపాల్టీ పైపులు వైసీపీ నేతల రియల్ వెంచర్‌లకు

● వైసీపీ నేతల కోసం ఏకంగా పైపు లైన్ నిర్మించారు

● ఇంజనీరింగ్ విభాగంలో అక్రమాలు వెలుగులోకి



కుళాయి

నరసరావుపేట, ఆంధ్రజ్యోతి, జూన్ 8: మున్సి పాల్టీలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వైసీపీ నేతలతో కలిసి అధికారులు సాగించిన అవినీతి దందా గుట్టు రట్టవుతోంది. కుళాయిల్లోనూ చేతివాటం ప్రదర్శించారు. మున్సిపల్ చట్టానికి వ్యతిరేకంగా అనధికారికంగా కుళాయి కనెక్షన్ లు ఇచ్చారు. అమృత్ పథకం హెచ్‌డీపీ పైపులను వైసీపీ నేతలకు ధారాదత్తం చేశారు. సదరు నేతల రియల్ వెంచర్‌లకు పైపులను అమ్మేసుకున్నారు. ఓ వైసీపీ నేత రియల్ వెంచర్‌కు ఏకంగా మున్సిపల్ నిధులతో పైపులైన్ నిర్మించారు.

పైపులైన్ అక్రమాలను నాడు ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదు. మున్సిపల్ కుళాయి కనెక్షన్‌కు డొనేషన్ చెల్లించాలి. ఇంటికి అయితే రూ.6 వేలు చెల్లించాలి. మున్సిపాల్టీ పరిధిలో లేని గృహాలకు అయితే రూ.12 వేలు చెల్లించాలి. బహుళ అంతస్తుల భవనాలకు ఒక్కొక్క ఫ్లాట్‌కు డొనేషన్ స్వీకరించాల్సి ఉంది. ఇవేవీ అమలు చేయకుండానే అక్రమంగా కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినట్టు తెలుస్తోంది. మున్సిపాల్టీ పరిధిలో లేని గృహాలకు అక్రమంగా కుళాయి



అమృత్ పథకం హెచ్‌డీపీ పైపులు

కనెక్షన్‌లు ఇచ్చినట్టు తెలిసింది. ఇవి పదుల సంఖ్యలోనే ఉన్నట్టు కార్యా లయ వర్గాల ద్వారా తెలిసింది. బహుళ అంతస్తుల భవనాలకు కూడా డొనేషన్‌లు స్వీకరించకుండానే అక్రమ పద్ధతిలో కుళాయిలు కనెక్షన్‌లు ఇవ్వడం వెలుగులోకి వచ్చింది. ఇలా అక్రమ కుళాయి కనెక్షన్‌లు ఇచ్చి కార్యాలయంలోని కొందరు జేబులు నింపుకున్నట్టు ప్రచారంలో ఉంది.

అమృత్ పథకం కింద పట్టణంలో డిస్ట్రిబ్యూషన్ లైన్‌ల కోసం మున్సిపాల్టీ హెచ్‌డీపీ పైపులను కొనుగోలు చేసింది. వైసీపీ నేతకు సంబంధించిన రియల్ వెంచర్‌కు ఈ పైపులను విక్రయించినట్టు తెలిసింది. ఈ వెంచర్ 60 అడుగుల సమీపంలో ఉన్నట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. బైపాస్ రోడ్డులో మరో వైసీపీ నేతకు సంబంధించిన రియల్ వెంచర్‌కు ఏకంగా పైప్ లైన్‌ను నిర్మించారు. ఇందుకు అమృత్ పథకం పైపులను వినియోగించారు. అమృత్ పథకం కింద తెలుగుదేశం కౌన్సిల్ హయంలో ఉచితంగా కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారు. అయితే ఈ కుళాయిలకు విడతల వారీగా డొనేషన్‌కు వసూలు చేయాల్సి ఉంది. నలుగురు ఉద్యోగులు వసూలు చేసిన డొనేషన్‌లను మున్సిపల్ కార్యాలయంలో జమ చేయకుండా వారి జేబులో వేసుకున్న ఉదంతం అలస్యంగా వెలుగుచూసింది. దాదాపు రూ.9 లక్షలు సదరు ఉద్యోగులు వాడేసుకున్నట్టు సమాచారం. ఇలా నీటి సరఫరా విభాగంలో అక్రమాలు చోటు చేసుకుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు వైసీపీ నేతలు అధికారుల అండదండలతో మున్సిపాల్టీ నిధులను బొక్కేశారు. మున్సిపాల్టీలో జరిగిన అవినీతి, అక్రమాలను తెలుగుదేశం ప్రభుత్వం బయట పెట్టి సంబంధితుల నుంచి మునిసిపాల్టీ సొమ్ము రికవరీ చేస్తుందో లేదో చూడాలి.

తెలుగు జాతి వెలుగు పెంచిన రామోజీరావు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



రామోజీ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 8 : తెలుగు జాతి వెలుగు పెంచిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావు మృతి చెందటం తెలుగుజాతికి తీరని లోటు అని చిలకలూరి పేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం ప్రత్తిపాటి హైదరాబాద్ వెళ్లి రామోజీ ఫిల్మ్‌సిటీలో రామోజీరావు పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటితో పాటు గట్టినేని రమేష్, తూబాటి శ్రీహరిరావు, కందుల రమణ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు కూడా పాల్గొని తమ సంతాపం తెలియజేశారు.

● చిలకలూరిపేటలో పలు చోట్ల రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పురుషోత్తమపట్నంలో కాపు జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు.

అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని పోరాడిన రామోజీ

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



రామోజీరావుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జూన్ 8: రామోజీరావు అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని అవినీతి, అరాచకంపై పోరాడిన శక్తి అని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం నరరావుపేటలోని పల్నాడు టీడపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీతినిజాయితీకి మారుపేరు రామోజీరావు అన్నారు. ఆయన సాధించిన విజయాలకు ఏడాది క్రితం ఆయనను కలిసి చెబితే నాకు చాలాతృప్తి అనిపించిందన్నారు. ఉభయతెలుగు రాష్ట్రాల ప్రజలు రామోజీరావు చేసిన సేవలు మరచిపోలేరన్నారు. సమావేశంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, గొట్టిపాటి జనార్ధన బాబు, రాపర్ల జగ్గారావు తదితరులు ఉన్నారు.

వినుకొండ, జూన్ 8: రామోజీ ఫిలిమ్ సిటీ, ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు పార్థివ దేహాన్ని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సందర్శించి పూలమాలతో నివాళి అర్పించారు, అనంతరం రామోజీరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

రామోజీరావు అస్తమయం బాధాకరం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 8: రామోజీరావు అస్తమయం బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కోటప్పకొండపై తెలుగు మహిళలు రామోజీరావు చిత్రపటం ప్రదర్శిస్తూ రామోజీరావు అమరహే అని నినాదాలు చేశారు.

తెలుగుజాతికి మార్గదర్శి రామోజీరావు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

తెలుగుజాతికి మార్గదర్శి రామోజీరావు మార్గదర్శి అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం నరసరావుపేట టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్ రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు హైదరాబాద్‌లో రామోజీరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

● వినుకొండలో బీజేపీ జిల్లా కార్యదర్శి మేడమ్ రమేష్, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త కొనిజేటి నాగశ్రీనురాయల్ రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎన్డీయా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, గుమ్మడి వెంకటేశ్వర్లు. తదితరులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

● వినుకొండ పట్టణ పార్టీ కార్యాలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, షమీమ్, గోవిందునాయక్, పత్తిపూర్ణ, వజ్రాల కృష్ణారెడ్డి, ముత్తినేని కొండలు, మక్కెన రామాంజనేయులు, షేక్ జానీ, కర్పాటి వెంకటరెడ్డి, మాదాల చిరంజీవి తదితరులు నివాళి అర్పించారు.

● శావల్యాపురంలో సీనియర్ టీడీపీ నాయకుడు ముంద్రు హనుమంతరావు రామోజీరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

● నూజెండ్లలో టీడీపీ నాయకులు ముంద్రు సుబ్బారావు, గంగినేని ఆంజనేయులు, రావుల మల్లేశ్వరరావు, గంగినేని రాధాకృష్ణమూర్తి, లగడపాటి సూరిబాబు, శ్రీనివాసరావు, మీసాల మురళీకృష్ణ యాదవ్, బచ్చు అంజిరెడ్డి తదితరులు రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఆలయాల్లో భాష్యం ప్రవీణ్ ప్రత్యేక పూజలు



అత్తలూరు రామాలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు

అమరావతి, జూన్ 8: పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన భాష్యం ప్రవీణ్ కుటుంబసభ్యులతో కలసి శనివారం మండల పరిధిలోని అత్తలూరు, వైకుంఠపురం గ్రామాల్లోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అత్తలూరులోని రామాలయంలో స్వామివార్లకు అర్చకులు శ్రీపతి బాలకృష్ణమాచార్యులు, ద్వారకనాధాచార్యులు పూజలు నిర్వహించి ప్రవీణ్ లావణ్య దంపతులకు ఆశీర్వచనం చేశారు. అనంతరం వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ఆశీర్వచనం పొందారు. ఇదే కార్యక్రమంలో గ్రామానికి చెందిన వెంగిశెట్టి వెంకటేశ్వరరావు 108 కొబ్బరికాయలు కొట్టి ప్రవీణ్ దంపతుల సమక్షంలో తన మొక్కు తీర్చుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే ప్రవీణ్ గ్రామంలోని మహాత్మాగాంధీ, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రవీణ్ సోదరులు నవీన్, కొండవీటి పాపారావు, కిషోర్, భాష్యం వీరాంజనేయులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుండటంతో మండల పరిధి గ్రామాల నుండి ప్రజలు మల్లాదిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంను శనివారం అధిక సంఖ్యలో సందర్శించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరము స్వామివారి శాంతి కళ్యాణం లో పాల్గొని భక్తి పారవశ్యం పొందారు. వెంకటేశ్వరుని దయ వలన ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ఆపార్టీ ఓటమితో ప్రజలకు విముక్తి కలిగిందని అందుకే స్వామివారిని దర్శించుకోవడం జరిగిందని పలువురు భక్తులు తెలియజేశారు.



మల్లాది వెంకన్న ఆలయంలో స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

నారా లోకేశ్‌కు అభినందనలు



నారా లోకేశ్‌కు బొకే అందిస్తున్న వట్టికూటి సైదారావు

పెదకూరపాడు, జూన్ 8 మంగళగిరి శాసన సభ్యులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శరవణ్ అగ్రిటెక్ కోల్డ్ స్టోరేజ్ ఎండీ వట్టికూటి సైదారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని లోకేశ్ గృహంలో శనివారం కలసి రాష్ట్రంలో కూటమి విజయంతో పాటు మంగళగిరిలో భారీ మెజార్టీతో విజయం సాధించిన లోకేశ్‌ను శాలువాత సత్కరించి బొకే అందించి అభినందనలు తెలిపారు.

వైసీపీ కోవర్టులను బహిష్కరించాలి

● యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోపి

పెదకూరపాడు, జూన్ 8 : జగన్‌మోహన్‌రెడ్డి ఓటమిని సహించ లేని కాంగ్రెస్ పార్టీలోని కొందరు వైసీపీ కోవర్టులు షర్మిలారెడ్డిపై ఇష్టాను రీతిగా మాట్లాడటం దుర్మార్గమని జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘంటా గోపీ అన్నారు. శనివారం పెదకూరపాడు లోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయటమే షర్మిల ఏకైక కర్తవ్యమని, వార్డు మెంబర్లుగా గెలవలేనివారు షర్మిలపై విమర్శలు చేసేవారా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో వైసీపీ కోవర్టులుగా ఉన్న వారిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం సుభానీ, పార్టీ నేతలు అబ్దుల్ రహీం, ముక్కెర ఉదయ్ శంకర్, షేక్ మౌలి, పులిగొండ వెంకటరావు, ఘంటా తిరుపతిరరావు, జమ్మిశెట్టి మారుతీనాయుడు, బలుసుపాటి గోపీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటికి విద్యాసంఘం నేతల అభినందనలు



ప్రత్తిపాటిని సత్కరిస్తున్న చిలకలూరిపేట విద్యాసంఘం నేతలు

చిలకలూరిపేట, జూన్ 8: ఇటీవల జరిగిన ఎన్నికల్లో 33వేలకు పైగా మెజార్టీతో గెలుపొందిన ప్రత్తిపాటి పుల్లారావును చిలకలూరిపేట విద్యా సంఘం నేతలు శనివారం కలసి అభినందనలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు, సహాయ కార్యదర్శి బేతంచర్ల రామ కోటేశ్వరరావు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు. వీరితో పాటు టీడీపీ యువజన విభాగం నాయకులు కదీర్ కూడా ప్రత్తిపాటిని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

జీవీ ఆంజనేయులు మెజార్టీపై దర్జీల సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న దర్జీలు

వినుకొండటౌన్, జూన్ 8: వినుకొండ ఎమ్మెల్యేగా జీవీ ఆంజనేయులు అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా పట్టణంలోని మహాత్మగాంధీ క్లాత్ మార్కెట్ వద్ద గల టైలర్స్ యూనియన్ కార్యాలయంలో అధ్యక్షుడు షేక్ బ్యాండ్ ఆధ్వర్యంలో శనివారం భారీ కేక్ కట్ చేసి ఆనందోత్సవాల మధ్య సంబరాలు జరుపుకుని, సభ్యులకు కేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాండ్ మాట్లాడుతూ యావత్ దేశం ఆశ్చర్యం పోయే విధంగా ఫలితాలు వచ్చాయని, 175కు 164 స్థానాలు రావడంతో భారతదేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తుందని తెలిపారు. ఇంతటి విజయాన్ని నమోదు చేసుకోవడం ఒక్క చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ప్రతి ఒక్కరు నారాచంద్రబాబు కోరుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గోవిందరాజులు, రబ్బాని, తుమ్మ నారాయణ, సయ్యద్ జిలాని, అంజయ్య, వందనం, ఖాసిం, దర్జీలు పాల్గొన్నారు.

మాలల సమస్యలపై పోరాడాలి

● మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్



మాలమహానాడు వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న కోట్టే వెంకట్రావు

వినుకొండ, జూన్ 8: నియోజకవర్గంలో మాలల సమస్యలపై పోరాడాలని రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ పిలుపునిచ్చారు. మాల మహానాడు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గం మాలమహానాడు వర్కింగ్ అధ్యక్షుడిగా వినుకొండ మండలం గోనుగుంట్లవారిపాలెంకి చెందిన కోట్టే వెంకట్రావును నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ తెలిపారు. అనంతరం వెంకట్రావుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌పాల్ మాట్లాడుతూ నేటి నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పని చేస్తూ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని గ్రామ, గ్రామానికి తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఉద్యోగులు, మహిళల, విద్యార్థుల, కార్మిక, కర్షకుల కమిటీలు ఏర్పాటు చేయాలని, మాలల సమస్యలపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కొంద్రు విజయ్, కార్యదర్శి రాయని చిన్న, వినుకొండ నియోజకవర్గం అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న చిత్రం

చిలకలూరిపేట, జూన్ 8 : పట్టణంలోని గొర్రెల మండి రోడ్డులో ఉన్న తాటి చెట్ల గ్రౌండ్‌లో 17 రోజుల పాటు ఈస్ట్ క్రిస్టియన్ స్ట్రీట్ వారి ఆధ్వర్యంలో సింగ్ అజిత్‌కుమార్ సహకారంతో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. వేటపాలెంకు చెందిన కోటి ఫ్రెండ్స్ సర్కిల్ వారు విజేతగా నిలిచి లక్ష రూపాయల ప్రథమ బహుమతి పొందారు. ఆల్ రైడర్ సత్తెనపల్లి వారు రూ.70వేల ద్వితీయ బహుమతిని అందుకున్నారు. నరసరావుపేట వెంకటసాయి ఫ్రెండ్స్ సర్కిల్ వారు రూ.50వేలతో ద్వితీయ బహుమతి పొందారు. మద్దిపాడు మనీ సీసీ వారు రూ.20వేలు బహుమతితో చతుర్థ బహుమతి పొందారు. మొత్తం 40 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, ప్రోత్సాహం అందించిన సింగ్ అజిత్ కుమార్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

రాజాపేట గురుకుల పాఠశాలలో ఉద్యోగావకాశాలు

చిలకలూరిపేట, జూన్ 8: చిలకలూరిపేట మండలం రాజాపేటలో ఉన్న గురుకుల పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికపై గెస్ట్ ఫ్యాకల్టీగా పలు ఉద్యోగావకాశాలు ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. పీజీటీ తెలుగు, హిందీ, లెక్కలు, ఇంగ్లిషు, టీజీటీ తెలుగులతో పాటు స్టాఫ్ నర్సు (పురుషులు) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. టీజీటీ అభ్యర్థులకు పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ, టీజీటీ అభ్యర్థులకు డిగ్రీతో పాటు బీఈడీ, స్టాఫ్‌నర్సు పోస్టుకు బీఎస్సీ నర్సింగ్ అర్హతలని ఆయన తెలిపారు. అన్ని ధ్రువపత్రాలతో వివరాలకు రెండు రోజుల్లోగా ఆసక్తి కలిగిన వారు సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా సుబ్బగురి యేగేంద్ర స్వామి తిరునాళ్ల



సుబ్బగురు యేగేంద్రస్వామి మూలవిరాట్

బొల్లాపల్లి, జూన్ 8: మండలంలోని వెల్లటూరులో సుబ్బగురు యేగేంద్ర స్వామి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. రైతులు తమ పశువులను గుడి చుట్టూ ప్రదక్షిణ చేయించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నకరికల్లు ఎస్ఐగా నాగేంద్రరరావు

నకరికల్లు, జూన్8: నకరికల్లు ఎస్ఐగా నాగేంద్రరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అమరావతి నుంచి ఆయన బదిలీపై నకరికల్లు ఎస్ఐగా విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన పీ.రాంబాబు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్ళారు.